క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారికి గురువారం తిరుమలగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఏసీ ఎంకేటీఎన్ వరప్రసాద్, చైర్మన్ పసుపులేటి రాధా సుబ్రమణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో సారె సమర్పించారు. వీరికి ఆలయం వద్ద చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు, అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు. తెలంగాణ రాష్ట్రం, హుజూర్‌నగర్‌కు చెందిన వెంకట లక్ష్మి సేవాసమితి సభ్యులు అమ్మవారికి ఆషాఢమాసం సారె సమర్పించారు.

కరకట్ట నిర్మాణ పనులకు స్థల పరిశీలన



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు పక్కన కరకట్ట నిర్మాణానికి సంబంధించి గురువారం జలవనరుల శాఖ అధికారులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ పి.గంగయ్య, డీఈ రామకృష్ణ, ఏఈ శ్రీలక్ష్మి, ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

పేటలో రెండు 108 అంబులెన్స్‌లు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 108, 104, ఫ్యామిలీ డాక్టర్, అర్బన్ హెల్త్ సెంటర్, ఆరోగ్యశ్రీ వంటి పలు వినూత్నమైన సౌకర్యాలతో సామాన్యులకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తూ వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నూతనంగా మంజూరైన రెండు 108 అంబులెన్స్ వాహనాలను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్లు సాదుపాటి రాజు, దువ్వల రామకృష్ణ, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, షేక్ మొహిద్దీన్, బద్దూనాయక్, చారుగుండ్ల కొండ, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి టిడ్కో గృహాల్లో గృహప్రవేశాలు

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ఈ ఏడాది డిసెంబర్ నాటికి స్థానిక బలుసుపాడు రోడ్‌లో నిర్మించిన టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి గృహప్రవేశాలు చేయించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం పట్టణ, మండల స్థాయి బ్యాంకర్ల సమితి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. సిబిల్ స్కోరు తక్కువ ఉన్న లబ్ధిదారులకు కూడా రుణాలు మంజూరుకు వెసులుబాటు కల్పించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, లీడ్ బ్యాంక్ మేనేజర్, పలు బ్యాంకుల మేనేజర్లు, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, మెప్మా సీవోలు నిర్మల, వెంకట్, గృహాల లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జగ్గయ్యపేటఅర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా గురువారం ఏఐటీయూసీ అనుబంధ జగ్గయ్యపేట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక నాయకులు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

మహిళా సాధికారతకు తార్కాణాలు

- ప్రగతిపథంలో మహిళా మార్టులు
- డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూత
- కార్పొరేట్‌కు దీటుగా వ్యాపారం



కంచికచర్లలోని చేయూత మహిళా మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



కంచికచర్లలోని చేయూత మహిళా మార్ట్



బార్ కోడ్ పద్ధతిలో విక్రయిస్తున్న సరుకులు

నందిగామ: గత పాలకులు మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకునేవారు. ప్రస్తుత పాలకులు మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఆలోచనతో వినూత్న ఆలోచనతో డ్వాక్రా మహిళలతో మండల కేంద్రాల్లో మహిళా మార్ట్‌లు ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో భాగంగా మూడు నెలల కిందట ఎన్టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా కంచికచర్ల, విస్సన్నపేటలలో మహిళా మార్ట్‌లు ఏర్పాటుచేశారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి మహిళా లక్షాధికారి కావాలనేదే తన లక్ష్యమని మాటల్లో చెప్పటమే కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నారు. అన్నగా నేనున్నానంటూ ఆడపడుచుల అభ్యున్నతికి సహాయ సహకారాలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో డ్వాక్రా మహిళలు మహిళా మార్ట్ ఏర్పాటు చేసి అభివృద్ధి దిశగా అడుగులు వేయడంతో పాటు తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

రూ.200 పెట్టుబడితో ప్రారంభమైన వ్యాపారం

కంచికచర్ల మండలంలో మొత్తం 1,830 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. ఆయా గ్రూపుల్లో 18,300 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారం దరూ ఒక్కొక్కరు రూ.200 చొప్పున పెట్టుబడి పెట్టి సుమారు రూ.35 లక్షలతో కంచికచర్ల లోని చెవిటికల్లు సెంటర్‌లో ఏడాది మార్చి 27 న చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. కార్పొరేట్ వ్యాపారులకు దీటుగా మహిళలు అన్ని రకాల సరుకులను వినియోగదారులకు సరసమైన ధరలకు అందించి ప్రజల మన్ననలు పొందుతున్నారు.

చేయూత మహిళా మార్ట్ ప్రత్యేకతలు

కంచికచర్ల పట్టణంలోని చేయూత మహిళా మార్ట్‌కు అనేక ప్రత్యేకతలున్నాయి. మహిళలు నేరుగా హోల్ సేల్ వ్యాపారుల వద్ద సరుకులను కొనుగోలు చేసి మార్కెట్‌లో ఉన్న దుకాణాలలో కన్నా తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. కేవలం స్వల్ప లాభాలు మాత్రమే తీసుకుంటూ వ్యాపారం చేస్తున్నారు. ఉచిత డోర్ డెలివరీ సౌకర్యంతో పాటు నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు అందిస్తుండడంతో వినియోగదారులు కూడా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మేమే నమ్మలేకపోతున్నాం



రోజుకు రూ.50 వేలకు పైగా వ్యాపారం నడుస్తోంది. ఈ స్థాయిలో వ్యాపారం చేస్తున్నామంటే మేమే నమ్మలేకపోతున్నాం. మాకు చాలా సంతోషంగా ఉంది. హోల్ సేల్‌గా సరుకులను తీసుకువచ్చి తక్కువ లాభాలతో వ్యాపారం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో వ్యాపారాన్ని మరింత పెంచబోతున్నాం.

– ఎం.రోజారమణి, మహిళా మార్ట్ అధ్యక్షురాలు

నేను తరచూ సరుకులు కొంటాను



మహిళా మార్ట్ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి నేను ఇక్కడే సరుకులు కొంటున్నాను. గతంలో బయట తీసుకున్న సందర్భంలో నెలవారీ ఖర్చు ఎక్కువ అయ్యేది. ప్రస్తుతం మూడు నెలలుగా ఇంటి సరుకుల నెలవారీ ఖర్చు తగ్గింది. సరకుల ధరలు తక్కువగా ఉండడంతో పాటు నాణ్యంగా ఉంటున్నాయి. అందుకే తరచూ ఇక్కడే కొనుగోలు చేస్తున్నాను.

– ఎ.స్వాతి ,పరిటాల

త్వరలో మరో ఏడు మహిళా మార్ట్‌లు



ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు మహిళా మార్ట్‌లు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదే విధంగా జిల్లాలోని డ్వాక్రా గ్రూపుల మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, అవసరమైన సహాయ, సహకారాలందించి ప్రతి మండలంలోనూ మహిళా మార్ట్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. రాబోయే కొద్ది రోజుల్లో మరో ఏడు మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వీటివల్ల మహిళలు ఆర్థికంగా మరింత ఎదగగలుగుతారు.

– పి.శోభారాణి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్

ఉత్సాహంగా జగనన్న సురక్ష శిబిరాలు



గనిఆత్కూరులో రైతుకు కౌలు గుర్తింపు కార్డు ఇస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ సచివాలయం-3లో సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

మోగులూరు/గనిఆత్కూరు(కంచికచర్ల): మీ ఇంటి తలుపు తట్టి సమస్యలు అడిగి తెలుసుకుని ఎటువంటి సర్వీస్ ఫీజు లేకుండా సర్టిఫికెట్లను జారీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని మోగులూరు, గనిఆత్కూరు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా మోగులూరులో 765 మంది లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. గనిఆత్కూరు గ్రామంలో 298 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి షేక్ మొయిద్దీన్‌బీ, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, సచివాలయాల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, ఎంపీటీసీ సభ్యులు ఆవల సామ్రాజ్యం, వేల్పుల రమేష్‌బాబు, మార్త శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, తహసీల్దార్ శంకరబాబు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి శ్రీలక్ష్మి ఏపీఎం కోట భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే 11 రకాల సేవలు

పెనుగంచిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే 11 రకాల సేవలు అందుతాయని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి అన్నారు. పెనుగంచిప్రోలు-2 సచివాలయంలో గురువారం సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, అనిగండ్లపాడు-2లో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రావనుకున్న సర్టిఫికెట్లు చేతికందుతున్నాయి

నందిగామటౌన్: జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా రావనుకున్న సర్టిఫికెట్‌లు వస్తున్నాయని, తీరవనుకుంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని ఐదు, ఆరు వార్డులకు సంబంధించి సచివాలయం-3, మండలంలోని చందాపురం గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, కమిషనర్ జయరాం, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్ షేక్ యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వైరా కట్టలేరు అప్రోచ్ రోడ్డు నిర్మాణం

వీరులపాడు: మండలంలోని వీరులపాడు, జయంతి గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును గురువారం ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో వైరా కట్టలేరుపై నిర్మించిన బ్రిడ్జి అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. అప్రోచ్ రోడ్డులో భూములు కోల్పోతున్న బాధితులకు టీడీపీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకపోవటంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే రహదారి కావటంతో పల్లంపల్లి నుంచి జమ్మవరం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణానికి సైతం అధికారులు అంచనాలు తయారు చేశారని త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీసభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష

రామచంద్రాపురం(వత్సవాయి): ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వైస్ ఎంపీపీ కాటేపల్లి రవిరామలక్ష్మి, సర్పంచ్ పాపినేని రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

నందిగామ: సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తనయుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు అన్నారు. నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని కొండూరు గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కామినేని రవిశంకర్, గ్రామ సర్పంచ్ కొత్రపాటి అచ్చారావు, పార్టీ ఏటిపట్టు గ్రామాల కన్వీనర్ దేవినేని రామారావు, సచివాలయాల ఏటిపట్టు గ్రామాల కన్వీనర్ దేవినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

550 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేత

గండ్రాయి(జగ్గయ్యపేట): గండ్రాయిలో సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ గండ్రాయి గ్రామం నుంచి షేర్‌మహ్మద్‌పేటకు వెళ్లేందుకు ఆర్‌అండ్‌బీ రహదారిని మూడు నెలల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 550 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ విజయశేఖర్, సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి తదితరులు పాల్గొన్నారు. అన్నవరం గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 300 మందికి పలు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

కౌలు కార్డు రాదనుకున్నా.. పిలిచి మరీ ఇచ్చారు!



కౌలు రైతు గుర్తింపు కార్డుతో నాగశివరావు

కంచికచర్ల: మండలంలోని మోగులూరు గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువ పత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఏళ్లుగా మండల కార్యాలయం చుట్టూ తిరిగినా రాని కౌలు రైతు కార్డులు, రేషన్ కార్డులు, ఇతర ధ్రువ పత్రాలు కూడా ఇప్పుడు పిలిచి మరీ చేతికి ఇవ్వడంతో లబ్ధిదారులు పట్టరాని సంతోషంతో ఉన్నారు.

శివరావు ఆనందతాండవం

అతను ఓ కౌలు రైతు. పేరు బండి నాగశివరావు. ఊరు మోగులూరు. ఓ భూ యజమానికి చెందిన మూడు ఎకరాల భూమిని గత ఎనిమిదేళ్ల నుంచి కౌలుకు తీసుకుని పంటలు సాగుచేస్తున్నాడు. ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారం, రైతు భరోసా పెట్టుబడి భూ యజమాని బ్యాంకు ఖాతాకు జమ అయ్యేది. అదేమంటే కౌలు రైతు కార్డు ఉంటే నీకే వస్తాయని అధికారులు గతంలో అనేవాళ్లు. ఆ కౌలు కార్డు కోసం గతంలో మండల కేంద్రమైన కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పని అయ్యేది కాదు. గ్రామ వలంటీర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు ఆయన ఇంటికి వచ్చినప్పుడు కౌలు రైతు కార్డు లేదని చెప్పాడు. వెంటనే రాసుకున్నారు. ఆ తర్వాత టోకెన్ ఇచ్చి ఈనెల 6న గ్రామ సచివాలయం వద్దకు వస్తే కౌలు రైతు కార్డు ఎమ్మెల్యే చేతులమీదుగా ఇస్తాం అని చెప్పారు. అయినా అతను వారి మాటలు నమ్మలేదు. అయితే చెప్పినట్టుగానే గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు నాగశివరావును పేరు పెట్టి పిలిచి కౌలు రైతు కార్డు ఆయన చేతికి అందజేశారు. దీంతో నాగశివరావు ఆనందానికి హద్దుల్లేవు.

పాలనలో కొత్త శకం

ప్రభుత్వ విప్ ఉదయభాను



పేటలోని 3 వ సచివాలయంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కొత్త శకం ప్రారంభమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని మిట్టగూడెం రెడెంకమ్మ ఆలయం వద్ద జరిగిన 11 వ సచివాలయం, వెంకటగిరి గుట్ట పుట్టబజారులో జరిగిన 3 వ సచివాలయం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొని పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానికంగా వడ్డెర్లకు శ్మశానవాటికను అభివృద్ధి చేసి ప్రహరీ నిర్మాణం చేపడతామని చెప్పారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించి డిసెంబర్ నాటికి గృహ యజమానులకు నూతన వస్త్రాలు పెట్టి మరీ గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. ఇంకా ఇళ్ల స్థలాలు లేని వారు దరఖాస్తు చేసుకుంటే రెండు నెలల్లో అందజేస్తామని హామీ ఇచ్చారు. 11 వ సచివాలయం పరిధిలో కుల ధ్రువీకరణ పత్రాలు 38, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 9, రైస్ కార్డు ఒకటి అందజేశామన్నారు. మూడవ సచివాలయం పరిధిలో ఈ క్యాంపులో ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 88, కుల ధ్రువీకరణ పత్రాలు 86, ఇతర ధ్రువీకరణ పత్రాలను 20 అందజేశారు. 1144 గృహాలకు నాలుగేళ్లలో రూ.6 కోట్ల 90 లక్షలు వివిధ పథకాల ద్వారా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కుంచపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారతావని గర్వించదగ్గ మహనీయుడు జగ్జీవన్‌రామ్

నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..



నందిగామలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పెనుగంచిప్రోలులో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సర్పంచ్, అధికారులు

నందిగామటౌన్: భారతావని గర్వించదగ్గ మహనీయులలో బాబూ జగ్జీవన్‌రామ్ ముందు వరుసలో ఉంటారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం కార్యాలయంలోని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి గాంధీ సెంటరులోని విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాదెండ్ల నరేంద్ర, మారం అమరయ్య, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాకాలపాటి కిరణ్, వైఎస్ ప్రసాద్, పారుపల్లి హరిబాబు, బండారు వెంకట్రావ్, సముద్రాల మధు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

పెనుగంచిప్రోలు: భారతావనికి మహోన్నత ఖ్యాతి తెచ్చిన నేత మాజీ ఉప ప్రధాని, భారత రత్న బాబూ జగ్జీవన్ రామ్ అని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు అధికారులు మాట్లాడుతూ దేశంలో దళితుల కోసం, వారి హక్కుల కోసం, రాజకీయ, ఆర్థిక సామాజిక అభివృద్ధి కోసం బాబూ జగ్జీవన్ రామ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఈఓపీఆర్‌డీ శ్యామ్, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జనార్ధనరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పోలీస్ అవుట్ పోస్టు ప్రారంభం

నందిగామటౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టును గురువారం ఏసీపీ జనార్దన్ నాయుడుతో కలిసి శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రారంభించారు. ముందుగా ఆస్పత్రిలోని వార్డులను, ఆపరేషన్ థియేటర్‌లను సందర్శించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికర స్థాయిలో సేవలందించాలని తెలిపారు. ముఖ్యంగా వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు రోగులతో మర్యాదగా నడుచుకోవాలని చెప్పారు. ఆస్పత్రిలోని వార్డులతో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, సీఐలు హనీష్, నాగేంద్రకుమార్, ఆస్పత్రి సూపరింటిండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు



పెనుగంచిప్రోలు: మునేరు అవతల మామిడి తోటల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని నందిగామ ఏసీపీ జనార్దన్ నాయుడు అన్నారు. అమ్మవారి సత్రాల ఆవరణలో మునేరు భక్తులకు అద్దెలకిచ్చే మామిడి తోటల యజమానులు, లీజ్‌దారులు, పనివార్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తోటల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో మృతి చెందిన కుటుంబానికి సహాయం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 26 వ వార్డులో గురువారం క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన షేక్ మున్నీ కుటుంబానికి ఆ వార్డు కౌన్సిలర్ పాకలపాటి సుందరమ్మ రూ.2 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు గండమాల నాగేశ్వరరావు, అల్లూరి భాస్కర్, పాకలపాటి డేవిడ్ రాజు, వలంటీర్ చైతన్య పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

మంగొల్లు(వత్సవాయి): రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. నందిగామ బ్రాంచ్ కెనాల్‌పై మంగొల్లు వద్ద మూడు కిలోమీటర్ల మేర కాలువ జంగిల్ క్లియరెన్స్ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.4.40 లక్షలతో మూడు కిలోమీటర్ల మేర పనులను చేపడతామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో అన్ని కాలువలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం ఎంపీ నిధులతో మంజూరైన వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వైస్ ఎంపీపీ కాటేపల్లి రవిరామలక్ష్మి, సర్పంచ్ అన్నెపాక ప్రణీత, ఎంపీటీసీ గోసు రత్నకుమారి, ఎన్ఎస్‌పీ ఈఈ ఆర్ సంతోష్, డీఈ రాంబాబు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ లేళ్ల నాగేంద్ర రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సామినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మనకోసం మన సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నందిగామ: మనకోసం మన సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. జూలై 9వ తేదీన నాగార్జున యూనివర్సిటీ సమీపంలో నిర్వహించనున్న మన కోసం మన సభ కార్యక్రమానికి సంబంధించి గురువారం నందిగామ పట్టణంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు పఠాపంచల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అదే రోజు జరగనున్న ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ రానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆల రామారావు, దుద్దుకూరు వెంకటకృష్ణ, గంగుల దుర్గాప్రసాద్, గాలంవెంకట్రామయ్య, జంగాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.